హైదరాబాద్
10-10-2023
సంపుటి:08
సంచిక: 365
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ఎన్నికలొచ్చాయ్..

### తెలంగాణ శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

**నవంబర్ 3 నోటిఫికేషన్**

**నవంబర్ 30 పోలింగ్**

**డిసెంబర్ 3 ఫలితాలు**

- తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఎలక్షన్లు..
- లోక్‌సభకు 'సెమీ ఫైనల్స్'..
- మిజోరం, ఛత్తీస్‌గఢ్ (తొలివిడత)లలో నవంబర్ 7న..
- ఛత్తీస్‌గఢ్ (రెండో విడత), మధ్యప్రదేశ్ నవంబర్ 17..
- రాజస్తాన్‌లో నవంబర్ 23న పోలింగ్
- ఐదు రాష్ట్రాల ఓట్ల లెక్కింపు, ఫలితాలు డిసెంబర్ 3నే..
- ఐదు రాష్ట్రాల్లో మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఉచితాలు, నగదు చేరవేతను అరికట్టేందుకు తనిఖీలు
- ఎన్నికల వ్యయంపై నిఘా
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడి






హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. అదే నెల 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం తెలంగాణతోపాటు మరో నాలుగు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది మొదట్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు సెమీఫైనల్‌గా భావిస్తున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మిజోరం శాసనసభలకు ఎన్నికల ఏర్పాట్లు, ఇతర వివరాలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్,ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ సోమవారం ఢిల్లీలో మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో ఒకే దశలో.. : వచ్చే ఏడాది జనవరి 16వ తేదీతో ముగిసే తెలంగాణ అసెంబ్లీలోని 119 నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఈసారి ఒకే విడతలో జరుగనుంది. నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు.

2లో



**కాంగ్రెస్ తో పొత్తు అంశంలో రాజకీయ అవగాహన కుదిరింది**

**సీట్ల అంశం మాత్రమే తేలాల్సి ఉంది**

**సీట్ల అంశం కూడా రెండు రోజుల్లో కొలిక్కి వస్తుంది**

ప్రస్తుతం కమ్యూనిస్టులకు చెరో రెండు సీట్లు అన్నది ప్రచారం మాత్రమే కాంగ్రెస్ పార్టీ నుంచి అలాంటి ప్రతిపాదన మాకు ఇంకా రాలేదు జాతీయస్థాయిలో ఇండియా కూటమిదలో కాంగ్రెస్ వామపక్షాలు ఉన్నాయి ఇక్కడ తెలంగాణలోనూ ఆ తరహా రాజకీయ అవగాహనతో ముందుకెళ్తాం పొత్తులో సీట్ల అంశం మీద తొందర లేదు నామినేషన్లు వేసే వరకు సమయం ఉన్నది సీట్లపై చర్చలు కొనసాగుతున్నాయి ఎన్నికల షెడ్యూల్ వస్తుందని బి ఆర్ ఎస్ వాళ్లకు కావాల్సిన అధికారులను రెండు రోజుల ముందే బదిలీ చేసుకుంటున్నారు అప్పటిదాకా పనిచేసిన అధికారులను అవమానపరుస్తూ బదిలీ చేస్తున్నారు

## యూపీఐ లావాదేవీలపైనా నిఘా..!

### రూ.10 లక్షలకు మించి ఆన్‌లైన్ లావాదేవీలుంటే

- ఆ వివరాలు బ్యాంకర్ల నుంచి సేకరణ
- రూ.50వేలకు మించి తీసుకెళితే పత్రాలు చూపాలి
- ఓటరుగా నమోదుకు అక్టోబరు 30 దాకా అవకాశం
- ఏకపక్షంగా ఉండే అధికారులపై చర్యలే: సీఈవో
- రాత్రి 10 నుంచి పొద్దున 6దాకా లౌడ్ స్పీకర్లు బంద్
- కాంగ్రెస్‌కు 48-60 స్థానాలుబీ బీఆర్ఎస్‌కు 43-55, బీజేపీకి 5-11: ఏబీపీ-సీ ఓటరు సర్వే




హైదరాబాద్, సిటీ: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, మద్యం, నగదు అక్రమ రవాణాతోపాటు ఆన్‌లైన్ (యూపీఐ) లావాదేవీల పైనా ప్రత్యేక నిఘా ఉంటుందని తెలంగాణ ఎన్నికల సంఘం, జీహెచ్ఎంసీ పేర్కొంది. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లినా, యూపీఐ ద్వారా ఎక్కువ మందికి డబ్బు పంపితే సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ ఆన్‌లైన్ లావాదేవీల వివరాలు బ్యాంకుల నుంచి సేకరిస్తామని స్పష్టం చేశాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాసరాజ్ బీఆర్కే భవన్‌లో, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్ రోస్ వివరాలు వెల్లడించారు. ఆస్పత్రులు, భూ క్రయ విక్రయాలు, వివాహాలకు సంబంధించి నగదు, బంగారం తీసుకెళితే సంబంధిత ఆధారాలు కచ్చితంగా చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కోడ్ అమల్లోకి వచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాలను అప్రమత్తం చేశామని, ఆయా జిల్లాల అధికారులకు ఈసీఐ మార్గదర్శకాలను వెల్లడిస్తామని వికాసరాజ్ పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు ఏదైనా పార్టీ, ఎవరైనా అభ్యర్థులకు మద్దతుగా ఏకపక్షంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని హెచ్చరించారు. ఈ మేరకు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు (కలెక్టర్లు), ఎస్పీలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్రంలోని పార్టీలు, పోటీ చేసే

2లో

## 17న రాష్ట్రానికి రాహుల్ గాంధీ!

- బస్సుయాత్రలో పాల్గొననున్న అగ్రనేత
- 20న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే రాక
- బస్సు యాత్ర రూట్ మ్యాప్‌పై నేడు భేటీ
- యాత్ర తర్వాతనే అభ్యర్థుల ప్రకటన

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్రంలో

2లో

## ఎన్నికల కోడ్‌లోకి అమిత్ షా సభ

**నేడు ఆదిలాబాద్‌కు రానున్న కేంద్ర హోంమంత్రి**



## గాజా దిగ్బంధం

- కరెంటు, నీరు, ఆహారం, ఇంధనం నిలిపివేత
- హమాస్ స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం
- 3 లక్షల మంది అదనపు బలగాల మోహరింపు
- ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా యుద్ధనౌకలు
- ఇరువైపులా మొత్తం 1,300 మందికిపైగా మృతి



2లో



## గోల్డిన్‌కు ఆర్థిక నోబెల్

**మహిళా శ్రామికశక్తిపై అధ్యయనానికి పురస్కారం**

**ఆర్థిక నోబెల్ అందుకోనున్న మూడో మహిళగా ఘనత**

## కృష్ణా జలాలపై తగ్గేదే లేదు

### రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే పరమావధి

- కేడబ్ల్యూడీటీ-2కు కేంద్రం కొత్త మార్గదర్శకాలపై ప్రధాని, హోంమంత్రికి లేఖలు
- జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం
- ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్ష
- తాజా మార్గదర్శకాల వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాన్ని వివరించిన అధికారులు
- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని ఇప్పటికే నిర్ణయం

అమరావతి: కృష్ణా నది జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్లాలని జల వనురుల శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణలో రాజీ పడే ప్రశ్నే లేదని తేల్చిచెప్పారు.

2లో

# కృష్ణా జలాలపై తగ్గేదే లేదు

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2)కు కేంద్ర జల్ శక్తి శాఖ కొత్త మార్గదర్శకాలతో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖలు రాయాలని ఆదేశించారు.రాష్ట్ర హక్కులను పరిరక్షించేలా అమసరమైన అన్ని చర్యలు చేపట్టాలని చెప్పారు. కృష్ణా జలాలపై కేంద్రం తాజా విధి విధానాలపై సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, న్యాయ నిపుణులతో సీఎం వైఎస్ జగన్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.కృష్ణా జలాల పంపిణీపై గతంలో బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1), బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) చేసిన కేటాయింపులపై సమగ్రంగా చర్చించారు. కేడబ్ల్యూడీట-2 తదుపరి నివేదిక ద్వారా మిగులు జలాల కేటాయింపుల్లోనూ రాష్ట్రానికి నష్టం జరిగిన అంశంపైనా చర్చించారు. ఈ పరిణామాలన్నీ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు వివరించారు.కేంద్ర మార్గదర్శకాలు విభజన చట్టం సెక్షన్-89లో పేర్కొన్న అంశాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని అధికారులు చెప్పారు. రాష్ట్ర విభజనకు ముందు చేసిన కేటాయింపులకు కట్టుబడి ఉండాలని విభజన చట్టం స్పష్టం చేస్తుంటే.. దీనిని ఉల్లంఘించేలా కేంద్రం మార్గదర్శకాలు ఉన్నాయని వివరించారు. ఇప్పటికే సుప్రీం కోర్టు ముందు పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు.అలాగే అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టంలో క్లాజ్-4ను కూడా కేంద్రం ఉల్లంఘించిందని, 2002కు ముందు చేసిన కేటాయింపులను, పంపకాలను పునఃపరిశీలించరాదని ఈ చట్టం స్పష్టం చేస్తోందని తెలిపారు. గోదావరి జలాల కేటాయింపులను ఇంకో బేసిన్‌కు తరలించుకోవచ్చన్న వెసులుబాటుతో మన రాష్ట్రం పోలవరం నుంచి తరలించే నీటిని పరిగణనలోకి తీసుకుని ఆమేరకు తెలంగాణకు కృష్ణా జలాల్లో అదనపు కేటాయింపులు చేసే అంశాన్ని కూడా కేడబ్ల్యూడీటీ-2కు నిర్దేశించడం సమంజసం కాదని, ఇది రాష్ట్రానికి నష్టమని అధికారులు వివరించారు.అదే తెలంగాణ గోదావరి నుంచి 214 టీఎంసీలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తున్నప్పటికీ, ఆ మేరకు కృష్ణా జలాలను అదనంగా మన రాష్ట్రానికి కేటాయించేలా కేడబ్ల్యూడీటీ%--%2కు జారీ చేసిన విధి విధానాల్లో చేర్చకపోవడంపైనా సమావేశంలో చర్చించారు. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్గనిర్దేశం చేశారు.




## గోల్డిన్‌కు ఆర్థిక నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

స్టాక్‌హోమ్: అమెరికాకు చెందిన ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్ ఆర్థిక రంగంలో ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అయిన గోల్డిన్ శ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, స్త్రీ, పురుషుల మధ్య వేతనాల్లో అసమానత్వం, లింగ వివక్ష తదితర అంశాలపై చేసిన అధ్యయనానికి గానూ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఆర్థిక రంగంలో నోబెల్ అవార్డు అందుకోనున్న మూడో మహిళగా ఆమె గుర్తింపు పొందనున్నారు.అమెరికాలో శ్రామిక రంగంలో మహిళల పాత్రకు సంబంధించిన సుమారు 200 ఏండ్ల డాటాను గోల్డిన్ విశ్లేషించారు. వేతన చెల్లింపుల్లో కాలక్రమేణా స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసాలు ఎప్పుడు, ఎందుకు మారుతున్నాయో వివరించారు.శ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యంపై గోల్డిన్ సమగ్ర అధ్యయనం చేశారని కమిటీ ఫర్ ది ప్రైజ్ ఇన్ ఎకనామిక్ సైన్సెస్ తెలిపింది. కమిటీ చైర్మన్ జాకబ్ స్వెన్సన్ ఆమె చేసిన విశేష కృషిని కొనియాడారు. 'శ్రామిక రంగంలో మహిళల పాత్ర గురించి అర్థం చేసుకోవడం సమాజానికి ఎంతో అవసరం. ఈ అంశంపై విశేష అధ్యయనం చేసిన గోల్డిన్‌కు ధన్యవాదాలు. శ్రామిక రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన వచ్చింది' అని జాకబ్ తెలిపారు.

## 17న రాష్ట్రానికి రాహుల్ గాంధీ!

(మొదటి పేజీ తరువాయి)



పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఆ రెండు రోజులూ పార్టీ ముఖ్య నేతల బస్సుయాత్రలో పాల్గొని ప్రచారాన్ని వేడెక్కించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ ముఖ్య నేతల బస్సు యాత్రను ఈ నెల 15న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. ఆమె పర్యటన పూర్తి కాగానే 17న బస్సు యాత్రలో రాహుల్‌గాంధీ జాయిన్ అవుతారని, 18న తిరిగి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఆయన పర్యటన పూర్తి కాగానే ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే బస్సు యాత్రలో పాల్గొంటారని, 20, 21 తేదీల్లో ఆయన పర్యటన ఉంటుందని పార్టీ వర్గాల సమాచారం. వారం నుంచి పది రోజుల పాటు జరిగే బస్సు యాత్రలో పార్టీ అగ్రనేతలు ముగ్గురూ పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపనున్నారు. కాగా, ముఖ్యనేతల బస్సు యాత్ర రూట్ మ్యాప్ ఖరారు చేసేందుకు గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) మంగళవారం భేటీ కానుంది. యాత్రను ఎన్ని రోజులు నిర్వహించాలి? ఎక్కడ ప్రారంభించాలి? అగ్ర నేతల పర్యటనలపైనా ఈ సమావేశంలో చర్చించి కార్యాచరణ ఖరారు చేయనున్నారు.

**బస్సు యాత్ర తర్వాతే అభ్యర్థుల ప్రకటన**

ముఖ్య నేతల బస్సు యాత్ర తర్వాతే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీలో సోమవారం భేటీ అయిన స్క్రీనింగ్ కమిటీ.. వంద వరకు సీట్లపై కసరత్తు చేసింది. మొత్తం 72 సీట్లలో ఏకాభిప్రాయానికి వచ్చారని, మిగిలిన సీట్ల పైనా సమీక్ష జరిపి 23న ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదం కోసం పంపనున్నట్లు తెలిసింది. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఏఐసీసీ ఇప్పటి వరకూ ప్రకటించలేదని, మీడియాలో వస్తున్నవన్నీ ఊహాగానాలేనని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. త్వరలోనే పార్టీ అధిష్ఠానం అధికారికంగా అభ్యర్థులను ప్రకటిస్తుందని పేర్కొన్నారు.

# 3 బెయిల్ పిటిషన్లు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)



అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలుచేసిన మూడు బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) ఎలైన్‌మెంట్‌లో అవకతవకలు, ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టులో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలతో సీఐడీ నమోదు చేసిన కేసులతో పాటు అంగళ్లు ఘటనలో పోలీసులు నమోదుచేసిన కేసుల్లో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి కె.సురేశ్‌రెడ్డి సోమవారం తన నిర్ణయాన్ని వెల్లడించారు. స్కిల్ డెవల్‌పమెంట్ కేసులో చంద్రబాబు ఇప్పటికే రాజమహేంద్రవరం జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో డీమ్డ్ కస్టడీగా పరిగణించి ఐఆర్‌ఆర్, అంగళ్లు ఘటనలో సాధారణ బెయిల్ మంజూరు చేయాలన్న చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదుల అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. ఆయన డీమ్డ్ కస్టడీ నిర్వచనం పరిధిలోకిరారని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్, అంగళ్లు ఘటన వ్యవహారంలో దాఖలు చేసిన రెండు బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. 'చంద్రబాబు స్కిల్ డెవల్‌పమెంట్ కేసులో అరెస్టయ్యారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. స్కిల్ కేసు, ప్రస్తుతం బెయిల్ కోసం పిటిషనర్ దాఖలు చేసిన రింగ్ రోడ్డు, అంగళ్లు కేసుల దర్యాప్తు అధికారులు వేర్వేరు.ఒక కేసుకు, మరో కేసుకు సంబంధం లేదు. ఒక కేసులో నిందితుడిని అరెస్టు చేసిన సందర్భంలో ఇతర కేసుల్లో సైతం అరెస్టయినట్లు సంబంధిత మేజిస్ట్రేట్ నుంచి ఉత్తర్వులు పొందాలని సీబీఐ వర్సెస్ అనుపమ్ కులకర్ణి కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. స్కిల్ కేసులో చంద్రబాబు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో ప్రస్తుత రెండు కేసుల్లో కూడా ఆయన కస్టడీలో ఉన్నట్లు భావించలేం. తనపై కేసులు నమోదు చేసిన వెంటనే అరెస్టు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, స్కిల్ కేసులో అరెస్టు చేశాక మరిన్ని రోజులు జైల్లో ఉంచాలనే ఉద్దేశంతో పాత కేసులు తెరపైకి తెస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే తనపై గతంలోనే కేసులు నమోదైనట్లు ఆయనకు అవగాహన ఉంది. ఇవే కేసులో ఇతర నిందితులు ముందస్తు బెయిల్ పొందినట్లు కూడా ఆయనకు తెలుసు. ముందస్తు బెయిల్ పొందేందుకు తనకున్న అవకాశాన్ని వినియోగించుకోకుండా నిర్లక్ష్యం చేసి.. అరెస్టు చేయడంలో ఉద్దేశపూర్వకంగా జాప్యంచేశారని పోలీసులను నిందించడానికి వీల్లేదు. తాము దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సరెండర్ పిటిషన్‌గా పరిగణించాలని చంద్రబాబు చేసిన అభ్యర్థనను ఆమోదించలేం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం బెయిల్ పిటిషన్ దాఖలు చేసేముందు సరెండర్ పిటిషన్ వేసుకోవాలి. ప్రస్తుత కేసులో అలాంటి పిటిషన్ ఏమీ దాఖలు చేయలేదు. చంద్రబాబు వ్యాజ్యంలో సరెండర్ అవుతున్నట్లు ఎలాంటి అభ్యర్థనా చేయలేదు. ఈ నేప?థ్యంలో బెయి ల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను సరెండర్ పిటిషన్‌గా పరిగణించలేం. ఆయన డీమ్డ్ కస్టడీ నిర్వచనం పరిధిలోకి రారని నిర్ణయానికి వచ్చిన నేప?థ్యంలో ఇరుపక్షాల న్యాయవాదులు వినిపించిన ఇతర వాదనల జోలికి న్యాయస్థానం వెళ్లడం లేదు. బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

**బెయిల్ ఇప్పుడివ్వలేం..**

ఏపీ ఫైబర్‌నెట్ వ్యవహారంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి తోసిపుచ్చారు. దర్యాప్తు కీలక దశలో ఉన్న ఈ సమయంలో బెయిల్ మంజూ రు చేయలేమన్నారు. 'టెరాసాఫ్ట్ సంస్థకు కాంట్రాక్టు అప్పగించడంలో చంద్రబాబుకు ప్రమేయం ఉందని నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌పై ఆధారపడింది. టెరాసాఫ్టకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని వ్యతిరేకించిన అధికారిని ఏపీ టెక్నాలజీ సర్వీస్ నుంచి మరో చోటకు మార్చినట్లు ఆధారాలు చూపిస్తోంది. ఫేజ్-1 ప్రాజెక్టు ఖర్చును రూ.330 కోట్లకు ఆమోదించే ప్రతిపాదనకు సంబంధించి నోట్ ఫైల్‌లో ఎలాంటి అభ్యంతరాలు, ప్రతికూల వ్యాఖ్యలు నమోదు చేయవద్దని చంద్రబాబు తనకు సూచించినట్లు అప్పటి ఇంధనశాఖ కార్యదర్శి సీఆర్‌పీసీ సెక్షన్164 కింద వాంగ్మూలం ఇచ్చారని ప్రాసిక్యూషన్ వివరించింది. కేసు నమోదు చేసిన రెండేళ్ల తర్వాత మాజీ సీఎంను నిందితుడిగా చేర్చడం వెనుక దురుద్దేశాలున్నాయన్న చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది వాదనతో ఏకీభవించలేం. టెరాసాఫ్టకు రూ.114 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూర్చారనే ఆరోపణలున్నాయి. మళ్లించిన నిధులు ఎక్కడకు చేరాయనే విషయం తేలాల్సి ఉంది. ఈ దశలో దర్యాప్తునకు అవరోధం కలగకూడదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని చంద్రబాబుకు ఈ దశలో ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# గాజా దిగ్బంధం

హమాస్‌పై దాడిని మరింత తీవ్రం చేసిన ఇజ్రాయెల్.. గాజాను గాలి ఆడకుండా చేస్తున్నది. చీలికలాంటి ఆ భూభాగాన్ని అష్టదిగ్బంధనం చేసింది. కరెంటు, నీరు, ఆహారం, ఇంధనం లాంటివేవీ అందకుండా చూస్తున్నది. అటు ఉగ్రవాద సంస్థ హమాస్ ఇటు ఇజ్రాయెల్ మధ్య హోరాహోరీగా కాల్పులు కొనసాగుతున్నాయి. ఇరువురి మధ్య యుద్ధంలో ఇంతవరకు 1300మందికి పైగా మృతిచెందారు.జెరూసలేం, అక్టోబర్ 9: హమాస్ మిలిటెంట్లు పాగా వేసిన గాజాస్ట్రిప్‌ను ఇజ్రాయెల్ దిగ్బంధం చేసింది. అక్కడికి కరెంటు సరఫరా, నీరు, ఆహారం, ఇంధన సరఫరాను నిలిపివేసింది. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గల్లాంట్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. 'గాజాకు కరెంట్ సరఫరాను నిలిపివేయాలని ఆదేశించాను. ఆహారం, ఇంధనం, నిత్యావసరాలు సరఫరా అయ్యే మార్గాలను మూసివేయాలని నిర్ణయించాం. 500 మంది హమాస్ మిలిటెంట్లను మట్టుబెట్టాం. చాలామందిని అదుపులోకి తీసుకున్నాం. హమాస్ నుంచి గాజాకు విముక్తి కల్పించడమే ఇజ్రాయెల్ లక్ష్యం' అని ఆయన పేర్కొన్నారు. గాజాలోని సుమారు 1000 ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. 159 ఇండ్లు, 1210 ఇతర నిర్మాణాలు కుప్పకూలాయి. దీంతో ఇప్పటికే గాజాలో లక్ష మందికి పైగా నిరాశ్రయులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తిండి, నీరు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు సరిహద్దులు దాటి ఇజ్రాయెల్‌లోకి చొచ్చుకొచ్చిన హమాస్ మిలిటెంట్లను ఐడీఎఫ్ దళాలు ఏరివేశాయి. సరిహద్దులను సైన్యం పటిష్ఠం చేసింది. రక్షణ కంచెల వద్ద యుద్ధ ట్యాంకులతో ఇజ్రాయెల్ దళాలు నిరంతరం పహారా కాస్తున్నాయి. అదనంగా 3 లక్షల మందిని ఇజ్రాయెల్ రంగంలోకి దించింది. ఇరువైపులా 1300 మందికి పైగా మరణించారు. మెరుపుదాడి చేస్తూ ఇజ్రాయెల్‌లో ఊచకోతకు దిగిన హమాస్ మిలిటెంట్లను ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. రాత్రికి రాత్రే 500 మంది మిలిటెంట్లను హతమార్చింది. కాగా, ఇప్పటికే హమాస్ మిలిటెంట్లు సుమారు 130 మందికిపైగా ఇజ్రాయెల్, ఇతర దేశాల వారిని బందీలుగా చేసుకున్నారు.హమాస్ చేసిన దాడుల్లో అమెరికాకు చెందిన 9 మంది పౌరులు మరణించినట్టు ఆ దేశం ప్రకటించింది. 12 మంది థాయిలాండ్ పౌరులు, బ్రెజిల్, బ్రిటన్, ఫ్రాన్స్, నేపాల్, మెక్సికో, ఉక్రెయిన్‌లకు చెందిన పౌరులు చనిపోయారు. దీంతో రంగంలోకి దిగిన అమెరికా తమ యుద్ధ నౌకలు, విమానాలను మధ్యధరా సముద్రంలో మోహరించింది.ఇజ్రాయెల్‌లో ఉంటున్న ఓ భారతీయురాలు హమాస్ రాకెట్ దాడుల్లో గాయపడ్డారు. కేరళకు చెందిన శీజ ఆనంద్ ఆష్కెలోన్ నగరంలో నర్సుగా పని చేస్తున్నారు. శనివారం ఆమె కుటుంబ సభ్యులతో వీడియోకాల్ మాట్లాడుతుండగా హమాస్ దాడుల్లో ఆమెకు గాయాలయ్యాయి.హమాస్ చేసిన మెరుపు దాడి వెనుక ఇరాన్ ఉన్నట్టు నివేదికలు వస్తున్నాయి. లెబనాన్ రాజధాని బీరూట్‌లో ఇజ్రాయెల్‌పై దాడికి సంబంధించి ప్రణాళికలు రచించేందుకు సమావేశాలు జరిగినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాలు వెలువరించింది.

## చంద్రబాబుపై నాకు ఎలాంటి కక్ష లేదు..

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబును చూసినప్పుడు, ఆయన పార్టీని చూసినప్పుడు పేదవాడికి, ప్రజలకు గుర్తుకు వచ్చేది.. మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాలు, వంచనలు. అలాంటి వ్యక్తిని ఎవ్వరూ కూడా కక్షసాధింపుతో అరెస్టు చేయలేదు. ఆయన మీద నాకు ఎలాంటి కక్ష లేదు. నేను లండన్‌లో ఉన్నప్పుడు చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారు. ఆ అరెస్ట్‌తోనూ నాకు ఎలాంటి సంబంధం లేదు అని సీఎం జగన్ స్పష్టం చేశారు. కక్షసాధింపే నిజమనుకుంటే.. కేంద్రంలో బీజేపీ ఉంది, దత్తపుత్రుడు బీజేపీతోనే ఉన్నానని ఇప్పటికీ అంటున్నాడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలితోపాటు, సగం టీడీపీ నేతలు బీజేపీలోనే ఉన్నారు కదా అని నిలదీశారు సీఎం జగన్.కేంద్రంలోని ఇన్‌కంటాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ చేశాయి. ఆయన అవినీతిని గమనించి నోటీసులిచ్చాయి, దోషుల్ని అరెస్టు చేశాయి. చంద్రబాబుకు నేరుగా ఇన్‌కంట్యాక్స్ నోటీసులు కూడా ఇచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. స్వయంగా దేశ ప్రధాని మోదీ, చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. పోలవరంను చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నారని ప్రధాని అన్నారు. రాష్ట్రంలో సీబీఐని, ఐటీని, ఈడీని అడుగు పెట్టనివ్వనని గతంలో చంద్రబాబు పర్మిషన్ కూడా విత్‌డ్రా చేశారు. ఆనాటికే అవినీతిపరుడని స్పష్టంగా రూఢి అయిన ఈ వ్యక్తిపైన.. విచారణ చేయకూడదని ఎల్లోమీడియా, ఎల్లో గజదొంగల ముఠా వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వ్యవస్థలతో మనం యుద్ధం చేస్తున్నాం అని సీఎం జగన్ అన్నారు. బాబును సమర్థించడమంటే..ప్రజల్లోకి వెళ్లి మీరు(పార్టీ శ్రేణుల్ని ఉద్దేశించి..) మరొక విషయాన్ని చెప్పాలి. బాబును సమర్థించామంటే.. .ఈ రాష్ట్రంలో పేద సామాజిక వర్గాలన్నింటినీ కూడా వ్యతిరేకించడమే అని చెప్పాలి. చంద్రబాబును సమర్థించడమంటే.. పేదవాళ్లకు వ్యతిరేకంగా ఉండటమే. చంద్రబాబును సమర్థించడమంటే.. పెత్తదాందీ వ్యవస్థను, నయా జమీందారీ వ్యవస్థను సమర్థించడమేనని చెప్పాలి. చంద్రబాబును సమర్థించడమంటే.. పేదవర్గాల పిల్లలకు ఇంగ్లిషు మీడియం అందకుండా వ్యతికేకించడమేనని చెప్పాలి. చంద్రబాబును సమర్థించడమంటే.. డెమోగ్రాఫిక్ ఇన్ బ్యాలెన్స్ అంటూ వారు ఏకంగా కోర్టుల్లో వేసిన దావాలను సమర్థించినట్లే అవుతుందని ప్రజలకు చెప్పాలి. చంద్రబాబును సమర్థించడమంటే.. కొన్ని వర్గాలు ఎప్పటికీ పేదలుగా, కూలీలుగా మిగిలివాలని సమర్థించినట్టేనని చెప్పాలి. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా? బీసీల తోకలు కత్తిరిస్తానన్న పెత్తందారీ భావజాలాన్ని సమర్థించడమేనని చెప్పాలి. మన ప్రతిపక్షాలు అన్నీ కూడా పొత్తులకోంస వెంపర్లాడుతున్నారు. వారు ఎంతమంది కలిసినా.. రెండు సున్నాలు కలిసినా, నాలుగు సున్నాలు కలిసినా.. సున్నాయే.

## చంద్రబాబుపై నాకు ఎలాంటి కక్ష లేదు..

నామినేషన్ దాఖలుకు నవంబర్ 10 ఆఖరు తేదీగా నిర్ణయించారు. నవంబర్ 13న దరఖాస్తుల పరిశీలన చేపడతారు. ఉపసంహరణకు నవంబర్ 15 వరకు గడువు ఇస్తారు. అదే నెల 30న రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఒకేసారి పోలింగ్ జరుగుతుంది. మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో రెండు విడతల్లో, మిగతా మూడు రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ పూర్తికానుంది. ఎన్నికల షెడ్యూల్, పోలింగ్ వేర్వేరు తేదీల్లో ఉన్నా.. ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపును మాత్రం డిసెంబర్ 3వ తేదీనే చేపట్టి, ఫలితాలను ప్రకటించనున్నారు.

**ఐదు రాష్ట్రాలు.. 16.14 కోట్ల మంది ఓటర్లు**

ఐదు రాష్ట్రాల్లోని మొత్తం 679 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా, మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించు కోనున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లేనని సీఈసీ రాజీవ్‌కుమార్ ప్రకటించారు. ఐదు రాష్ట్రాల్లో కలిపి 2,900కు పైగా పోలింగ్ కేంద్రాలను యువత నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నగదు తరలింపు, ఉచితాలు, బహుమతులు, మద్యం, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడానికి విస్తృత తనిఖీలు చేపట్టనున్నామని.. ఈ మేరకు నిఘా వ్యవస్థను పటిష్టం చేశామని వివరించారు. ఐదు రాష్ట్రాల్లో మొత్తం 940 చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

**మొదటిసారిగా 'సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం'**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్)ను ఎవరైనా అతిక్రమించినట్టు గుర్తిస్తే.. సీవిజిల్ యాప్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చని సీఈసీ రాజీవ్ కుమార్ సూచించారు. క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు తప్పనిసరిగా కేసులకు సంబంధించి పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మొదటిసారిగా 'ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం'ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు.

## ఎన్నికల కోడ్‌లోకి అమిత్ షా సభ

ఆదిలాబాద్: బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఆదిలాబాద్ రాను న్నారు. జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. జనగర్జనగా దీనికి నామకరణం చేశారు. ఇటీవలే అమిత్ షా ఆదిలాబాద్ పర్యటన ఖరారవగా ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో ఈ సభ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) పరిధిలోకి వెళ్లనుంది. బీజేపీ అభ్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాకపోవడంతో ఈ సభ ఖర్చు పార్టీ పరిధిలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. నేపథ్యంలో బీజేపీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. ఆదిలాబాద్ పట్టణాన్ని కాషాయ జెండాలతో నింపేసింది. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర రాష్ట్ర నేతల ఫొటోలతో కూడిన భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది.

# రానున్న కాలంలో మరో హైటెక్ సిటీ గా తుక్కుగూడ మున్సిపాలిటీ::విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.



**మహేశ్వరం సమ సమాజం:**తుక్కుగూడ మున్సిపాలిటీలో 8 కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేసిన విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. 10వ వార్డు లో 2 కోట్ల రూపాయల నిధులతో చేపట్టే మోడ్రన్ ధోబి ఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. 10వ వార్డులో %ఎవీబొా ఉ ూదీ% 2 కోట్ల 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. 10వ వార్డులో 40 లక్షలతో లక్ష్మీ ఫంక్షన్ హాల్ నందు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి. 10వ వార్డు లో 50 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి . 5వ వార్డు లో 3 కోట్లతో క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సబితమ్మ. సబితమ్మ మార్క్ పాలనకు నిదర్శనం అంటున్న జనం..హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు..పెద్ద ఎత్తున నిధులతో అభివృద్ధికి బాటలు వేసారు... ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...ఫ్యాబ్ సిటీ,ఫార్మా సిటీ,ఫ్యాక్స్ కాన్ ల రాకతో రానున్న కాలంలో తుక్కుగూడ ప్రాంతం ఊహించని విధంగా మారనుందని,ఎయిర్పోర్ట్ వరకు నిర్మించనున్న మెట్రో రైలును ఇక్కడి వరకు పొడిగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ 6600 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయటం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. తుక్కుగూడ గ్రామానికి ప్రతీకగా నిలిచే బురుజు అభివృద్ధికి 25 లక్షలు కేటాయించి శంకుస్థాపన చేసినట్లు,అదే విధంగా బతుకమ్మ ఘాట్ పనులకు శ్రీకారం చుట్టినట్లు,రెండింటికి ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తుక్కుగూడ మునిసిపాలిటీలో ఇప్పటివరకు 50 కోట్లు తాగునీటికి నిధులు మంజూరు చేసినట్లు,పనులు కొనసాగుతున్నాయని అన్నారు. తుక్కుగూడలో రోడ్ల వెడల్పుకు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేటీఆర్ కృషితో లైట్ల నిర్మాణానికి 5 కోట్ల 50 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్ళు లాగా ప్రభుత్వం ముందుకెళ్తుందని,కుల,చేతి వృత్తుల వారికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి కేసీఆర్ గారు మానవీయ కోణంలో ఆలోచించి ఈ పథకం తీసుకువ చ్చారన్నారు.ఇప్పటికే గొల్ల కురుమ సోదరులకు గొర్రెలు ఇస్తూ, రజక,నాయి బ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు అభివృద్ధిలో ముందుకెళ్తూనే సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాలు ఇచ్చి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ళ పండుగ చేసుకున్నాం అన్నారు.200 రూపాయలు ఉన్న పెన్షన్లను 2,వేలకు పెంచి,3 వేలు ఉన్న వికలాంగుల పెన్షన్ ను 4 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ గారికే దక్కుతుందని అన్నారు.ఈ ప్రాంతంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ లలో 10 శాతం స్థానిక కోటాలో భాగంగా స్థానికులకు కేటాయించినట్లు,అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. మహేశ్వరం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన 25 కోట్ల నిధులకు సంభందించి ఇటీవలే కేటీఆర్ శంకుస్థాపన చేసారని పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో తుక్కుగూడలో జరిగిన అభివృద్ధిని సమీక్షించి, రానున్న కాలంలో చేయాల్సిన వాటికి ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు.తుక్కుగూడ మునిసిపాలిటీలో ఇప్పటివరకు 50 కోట్లు తాగునీటికి నిధులు మంజూరు చేసినట్లు,పనులు కొనసాగుతున్నాయని అన్నారు.తుక్కుగూడలో రోడ్ల వెడల్పుకు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.కేటీఆర్ కృషితో లైట్ల నిర్మాణానికి 5 కోట్ల 50 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ఇప్పటికే తుక్కుగూడ ప్రాంతంలో 58 కంపెనీలు వచ్చాయని, మరో 9 నెలల్లో ఫాక్స్ కాన్ సంస్థ నిర్మాణం పూర్తి అవుతుందని,ఈ ప్రాంతంలో లక్షకు పైగా ఉద్యోగులు రానున్నారని,స్థానికులకు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుందన్నారు.రానున్న కాలంలో ఈ ప్రాంతం మరో హైటెక్ సిటీగా కానుందన్నారు.అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్ళు లాగా ప్రభుత్వం ముందుకెళ్తుందని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 10 చెరువుల్లో 40 కోట్ల రూపాయల నిధులతో కొనసాగుతున్న చెరువుల సుందరికరణ.మిషన్ కాకతీయ ద్వారా పూడిక తీయటంతో నిండుగా రావిర్యాల జలాశయం. తుక్కుగూడ మునిసిపాలిటీ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువు సుందరికరణకు 6 కోట్ల 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లుతెలిపారు.ఇప్పటికే నియోజకవర్గంలో బడంగ్ పేట్,మీర్ పేట్,జల్ పల్లి ల పరిధిలోని 10 చెరువులలో 40 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సుందరికరణ పనులు జరుగుతుండగా,తుక్కుగూడ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువు అభివృద్ధి, సుందరికరణ పనులకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.రావిర్యాల చెరువు వద్ద 6 కోట్ల 50 లక్షలతో బండ్ నిర్మాణం తో పాటు పెద్ద ఎత్తున సుందరికరణ పనులు చేపట్టనున్నారు.అదే విధంగా లైటింగ్,వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మహేశ్వరం నియోజకవర్గంలోని రెండు కార్పొరేషన్లు,మునిసిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గములో 15 కోట్లతో వివిధ కుల సంఘాల వారికి ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.గృహ లక్ష్మీ పథకం కింద అర్హులైన వారికి 3 లక్షలు ఇల్లు కట్టుకోవటానికి ప్రభుత్వం అందిస్తుందన్నారు.



## డోర్నకల్ లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుంది

**మండల అధ్యక్షులు బట్టు నాయక్**

**దంతాలపల్లి సమ సమాజం:**డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ తో విజయం సాధిస్తుందని దంతాలపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుగులోతుబట్టు నాయక్ అన్నారు. మండలంలోని గున్నేపల్లి గ్రామంలో మేనిఫెస్టో ఇంటింటి తిరిగి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం వస్తే 500 గ్యాస్ సిలిండర్ కల్యాణ లక్ష్మి ప్రతి మహిళకు 2500 ఇందిరమ్మ ఇళ్లకు ఆరు లక్షలు మహిళలకు బస్సు ఉచిత సౌకర్యం వంటి అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ అధికారం వస్తే పెడుతుందని ఆయన అన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొంది అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దాట్ల ఎంపీటీసీ కొమ్మినేని సతీష్, జిల్లా నాయకులు రాజశేఖర్, హరికృష్ణ, కడుదుల మహేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, గణేష్, రాములు, లింగారెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ చీరల పంపిణీ



**మహేశ్వరం సమ సమాజం:**బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ నాదర్ గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ చీరల పంపిణీ నిర్వహించిన .టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, కో ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్ రెడ్డి, నాయకులు శ్రీశైలం చారి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, సుబాన్ యాదవ్, సామ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బందు పథకం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**గూడూర్ సమ సమాజం:** గూడూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో బీసీ బందు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన నిరుపేద బీసీలకు బీసీ బంద్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నూకల రాధిక సురేందర్ మండల సంయుక్త కార్యదర్శి పెసరి శివ దామరవంచ సర్పంచ్ కొమ్మలు వలెపు శ్రీనివాస్ భాష పాక నవీన్ బొంత రాములు గుండెంగ బాలు శ్రీను తదితరులు పాల్గొన్నారు

## తూర్పు గూడెం గౌడ సంఘం భవన నిర్మాణం ప్రారంభించిన ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



**ఆలేరు అక్టోబర్ 9: సమ సమాజం:** ఆలేరు మండలం తూర్పు గూడెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినారు కార్యక్రమంలో తూర్పు గూడెం గ్రామానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, పీరీల దర్గా భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసినారు. తూర్పు గూడెం సర్పంచ్ వంగాల శ్రీశైలం, పిఏసిఎస్ చైర్మన్ మల్లేశం గౌడ్, తూర్పు గూడెం మాజీ సర్పంచ్ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తమ్మిలి ఆశయ్య, బి ఆర్ ఎస్ తూర్పు గూడెం గ్రామ శాఖ అధ్యక్షులు బండి నరేందర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు బండి రాములు గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కొల్లూరు మాజీ ఎంపీటీసీ కోటగిరి ఆంజనేయులు గౌడ్, బండి బాబు గౌడ్, ఎంఢ్రి వెంకటేష్ ముదిరాజ్, తూర్పు గూడెం టిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఐలి కృష్ణ గౌడ్, జనగాం వెంకట్ పాపిరెడ్డి, దారా సురేష్, తూర్పు గూడెం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

## రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాంబాబు జన్మదిన వేడుకలు.

**హైదరాబాద్ సమ సమాజం:** రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోం లో వుద్దుల మధ్య రియల్ ఎస్టేట్ రంగంలో సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతున్న జేయవిలసిని డెవలపర్స్ ఎండి రాంబాబు జన్మదిన సందర్భంగా రెడీ టు సర్వ్ ఫౌండేషన్ కి రావడం జరిగింది వృద్ధుల బాగోగులు తెలుసుకొని తను కూడా ఎవరి మంత్ రెండు రైస్ బ్యాగ్ ఇస్తానని మాట ఇచ్చాడు జయ విలసిని ఎండీ రాంబాబు సర్ మ ఓల్డ్ ఏజ్ హోమ్ కి రావడం చాలా ఆనందం గా ఉంది అని పెద్ది శంకర అనారు ఈ కార్యక్రమానికి బతుకమ్మ మూవీ హీరో విజయ్ భాస్కర్ . శివ నేత. సుమంత్. రాజ్ కుమార్ .సాయి. కృష్ణ రెడ్డి. పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం




**నూతనకల్ సమ సమాజం:** మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారులు గ్రామాల్లోని సమస్యలను పరిష్కారం కొరకు సమన్వయంతో పని చేయాలని కోరారు. నీటిపారుదల శాఖపై జరిగిన చర్చలో మండల పరిధిలోని సోమ్లా తండాకు ఉన్న చెరువులకు కుంటలకు కాలువలు తవ్వకపోవడంతో నీటి సరఫరా కావడంలేదని సర్పంచ్ శంకర్ నాయక్ ఎంపీటీసీ సజ్జన్ నాయక్ సభ దృష్టికి తీసుకువచ్చారు.మండల విద్యాధికారి రాములు నాయక్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సర్పంచులు చొరవ తీసుకోవాలని,చిల్పకుంట్ల పాఠశాల సమీపంలో ఉన్న పెంటదిబ్బలను తీసి వేయుటకు సర్పంచ్ చొరవ చూపాలని కోరారు.అనంతరం అధికారులు తమ వెంట తెచ్చుకున్న నివేదికలను చదివి వినిపించారు.సమావేశం నిర్వహిస్తుండగానే కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో తాసిల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి నుండి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు నాయకులు ఎన్నికల నిబంధనలను పాటించి సహకరించాలని కోరారు. ఈనాటి కార్యక్రమంలో జడ్పీటిసి కందాల దామోదర్ రెడ్డి,ఎంపీడీవో ఇందిరా,పిఎసిఎస్ చైర్మన్ కనకటి వెంకన్న,సర్పంచులు కొంపల్లి రాంరెడ్డి,మరాఠీ రామస్వామి,ఎంపీటీసిలు సురకంటి జానమ్మ యాదగిరిరెడ్డి,ఏర్పుల నరేష్,మిషన్ భగీరథ ఏఇ గుండు రావు,ఎంపివో శశికళ, ఎపిఓ మామిడి శ్రీరాములు,ఏపిఎం కరుణాకర్,పశు వైద్యాధికారి రవికుమార్,ఏవో మురళి షబాబు,అంగన్వాడి సూపర్వైజర్స్ మంజులత,పద్మ, పంచాయతీ కార్యదర్శులు తాళ్లపల్లి వెంకన్న,శర్మ శ్రీనాథ్, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వీధి నిఘానేత్రంలోకే సీసీటీవీ కెమెరాల ద్వారా నేర శాతం తగ్గుముఖం: సీపీ డిఎస్ చౌహాన్ ఐపీఎస్



**ఎల్బీనగర్ సమ సమాజం:**సీసీ కెమెరాల నిఘా ద్వారా రాచకొండ పరిధిలో నేరశాతం తగ్గుముఖం పట్టిందని రాచకొండ కమిషనర్ శ్రీ డిఎస్ చౌహాన్ ఐపీఎస్ పేర్కొన్నారు. ఈరోజు కర్మన్ ఘాట్ లోని క్రాంతి గ్రౌండ్ లో జరిగిన "ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో 104 కాలనీలలో కొత్తగా ఏర్పాటు చేసిన 1080 సీసీటీవీల ఆవిష్కరణ" కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటులో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని, నగర పరిధిలోని ప్రతి వీధి సీసీటీవీ నిఘానేత్రంలోకి వచ్చిందని అందువల్లే నేరస్తులు నేరాలు చేయడానికి భయపడుతున్నారని కమిషనర్ పేర్కొన్నారు. సిసి కెమెరాల ద్వారా వాహన ప్రమాదాలు, ఇండ్లలో జరిగే దోపిడీలు, వాహన చోరీలు, చైన్ స్నాచింగ్లు వంటి పలు రకాల నేరాలు చాలావరకు తగ్గుముఖం పట్టాయని కమిషనర్ తెలిపారు. ఏదైనా నేరం జరిగితే కేవలం 24 గంటల్లోనే నేరస్తులను పట్టుకునే విధంగా ఈరోజు తెలంగాణ పోలీస్ వ్యవస్థ రూపొందడడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో ఉందని కమిషనర్ పేర్కొన్నారు. తమ కాలనీలో, తమ ఇంటి ఆవరణలో కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేష్, ఎమ్మెల్సీ దయానంద్, ఎల్బీనగర్ డిసిపి సాయి శ్రీ, అదనపు డీసీపీ, ఎల్ బి నగర్ ఎసిపి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం నశించాలి ౧ గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.

**ఎల్బీనగర్ సమ సమాజం::** ప్రజా సమస్యలపై స్పందించని జిహెచ్ఎంసి మరియు పోలీస్ అధికారుల నిర్లక్ష్య ధోరణిని వ్యతిరేకిస్తూ చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా ఆధ్వర్యంలో చైతన్యపురి ఫ్రూట్ మార్కెట్ వద్ద చేపట్టిన ప్రజా నిరసన దీక్ష కార్యక్రమానికి మద్దతుగా పాల్గొన్న బీజేపీ రంగారెడ్డి ( అర్బన్ ) జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి మరియు గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి . ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్ మాట్లాడుతూ చైతన్యపురి డివిజన్లోని ప్రభాత నగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై ఇష్టారాజ్యంగా ఫ్రూట్స్ అమ్మడంతో కాలనీ వాసులకు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్య మరియు రోడ్లపై చెత్త వేయడంతో అనారోగ్యంతో గురవుతున్నారని స్థానిక కార్పొరేటర్ నరసింహ గుప్తా ఎన్నోసార్లు జిహెచ్ఎంసి, పోలీస్ అధికారులకు సూచించిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సిగ్గుచేటు అన్నారు. ప్రయాణికులకు, విద్యార్థులకు రక్షణ కల్పించే వరకు భారతీయ జనతా పార్టీ పక్షాన పోరాడుతామని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రభాత నగర్ కాలనీ వాసులు రమణ , శంకర్ , రాజిరెడ్డి , రవి కుమార్ , శివ , బాలు మరియు బీజేపీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్ మరియు బీజేపీ నాయకులు జయ ప్రకాష్ , సుమన్ , కృష్ణం రాజు , మల్లేష్ , తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తాం

**జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**

**కోరుట్ల కౌన్సిలర్ భర్త హత్య కేసులో 9 మంది నిందితులపై పీడీ యాక్ట్ అమలు. నిందితులకు కరీంనగర్ జైల్లో పీడి ఉత్తర్వులు అందజేత.**

జగిత్యాల, సమ సమాజం:శాంతిభద్రతలకు, సామాజిక శాంతికి భంగం కలిగించే వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తామని జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. కోరుట్ల పట్టణంలో కౌన్సిలర్ భర్త లక్ష్మీరాజం హత్య కేసులో పాల్గొన్న 9 గురు నిందితులపై సోమవారం పీడి ఆక్ట్ అమలు చేయడం జరిగిందని పీడి ఆక్ట్ నమోదు చేసిన ఉత్తర్వుల కాపీని నిందితులకు కరీంనగర్ జైల్లో అందజేసి వారిని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగిందని ఎస్పీ భాస్కర్ తెలిపారు.పీడీ యాక్ట్ నమోదు చేసిన నిందితులు 1.విత్తనాల నాగరాజు,2. విత్తనాల తిరుపతి,3. కాసుల వంశీ ప్రసాద్,4. పిల్లి సత్యనారాయణ,5.గుడ్ల విశాల్,6. కాసుల మధుమోహన్,7. మర్త నరసింహ,8. మారుపాక ప్రభాస్,9. శ్రీరాముల దీపక్ లపై తేదీ: 08-08-2023 రోజున కోరుట్ల పట్టణంలోని కార్గిల్ చౌరస్తా కి ఎదురుగా ఉన్న శంకర్ టీ స్టాల్ నందు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖానికి మాస్క్ ధరించి టీ తాగడానికి వచ్చిన స్థానిక కోరుట్ల కౌన్సిలర్ భర్త లక్ష్మీరాజంపై కత్తులతో ఒక్కసారిగా దాడి చేసి మోటార్ సైకిల్ పై పారిపోయారు. గాయాల పాలైన లక్ష్మీరాజంను కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అదే రోజు మృతుని భార్య పోగుల ఉమారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 9 మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది ఇందులో 9 మంది పై సోమవారం పీడి యాక్ట్ నమోదు చేయడం జరిగింద ఎస్పీ భాస్కర్ తెలిపారు.నేరాల నియంత్రణ చట్టం 1986 (చట్టం సంఖ్య 1/1986), తెలంగాణా నియంత్రణ చట్టం ( సవరణ చట్టం సంఖ్య 13/2018) ప్రకారం వీరు నేరాలకు పాల్పడే నేరస్తులు గా నిర్ధారించి, వీరి బారి నుండి ప్రజలను రక్షించాలన్న ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం పి.డి. యాక్ట్ పెట్టడం జరిగింది. పైన పేర్కొన్న నిందితులు సాధారణ ప్రజల మనసుల్లో భయాందోళనను సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాధం కలిగిస్తూ ప్రజా జీవనంపై ప్రతికూల ప్రభావం కలిగిస్తూ శాంతిభద్రతలకు,సామాజిక శాంతికి భంగం కలిగిస్తున్నారు.ఇట్టి నిందితులపై గతంలో కేసులు నమోదు కావడం జరిగిందని భవిష్యత్తులో ఇంకా ఎవరైనా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వారిపై పిడి యాక్ట్ అమలు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ భాస్కర్ తెలిపారు. ఈ పీడీ యాక్ట్ ను అమలు చేయడంలో కీలక పాత్ర పోషించిన మెట్ పల్లి డిఎస్పి రవీంధ్ర రెడ్డి, కోరుట్ల సీ.ఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ భాస్కర్ అభినందించారు .

## ప్రో కబడ్డీ లీగ్ వేలంలో రికార్డు ధర పలికిన ఇరాన్ ప్లేయర్ మొహమ్మద్‌రెజా .

**పీకేఎల్ 10వ సీజన్ వేలం**

ముంబై: ప్రో కబడ్డీ లీగ్ 10 సీజన్ వేలంలో ఇరాన్‌కు చెందిన మొహమ్మద్‌రెజా షాద్‌లూయి చియానేహ్ రికార్డు ధర పలికాడు. సోమవారం ముంబైలో జరిగిన వేలంలో రైడర్, డిఫెండర్ అయిన షాద్‌లూయిని పుణేరి పల్టన్ రూ.2.35 కోట్లకు కొనుగోలు చేసింది. దాంతో, పీకేఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా ఈ ఇరానీయన్ నిలిచాడు. ఈమధ్యే ముగిసిన ఆసియా క్రీడల్లో ఇరాన్ కెప్టెన్‌గా షాద్‌లూయి అదరగొట్టాడు. దాంతో, అతడి కోసం యూ ముంబా, గుజరాత్ జెయింట్స్, తెలుగు టైటాన్స్ పోటీ పడ్డాయి. చివరకు పుణేరి పల్టన్ కళ్లు చెదిరే ధరతో ఈ ఇరాన్ కెప్టెన్‌ను సొంతం చేసుకుంది. ఇక.. భారత స్టార్ మనీందర్ సింగ్‌ను రూ. 2.12 కోట్లకు బెంగాల్ వారియర్స్ దక్కించుకుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ వేలం ప్రక్రియలో 12 జట్లు పాల్గొన్నాయి. సోమవారం గ్రూప్ ఏ, బి ఆటగాళ్లు వేలం జరగగా.. మంగళవారం గ్రూప్ సీ, గ్రూప్ డీ ఆటగాళ్లు వేలంలోకి రానున్నారు.




# ఉప్పల్ వేదికగా పాక్‌తో తలపడనున్న శ్రీలంక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వన్డే వరల్డ్ కప్‌లో ఉప్పల్ స్టేడియం వేదికగా మంగళవారం మరో ఆసక్తికర పోరాటం అభిమానులను అలరించనుంది. ఆసియా జట్లు పాకిస్థాన్, శ్రీలంక నువ్వానేనా అన్నట్లు తలపడనున్నాయి. మెగా టోర్నీలో నెదర్లాండ్స్‌పై సాధికార విజయంతో బాబర్ సేన బోణీ కొట్టగా.. దక్షిణాఫ్రికా చేతిలో దసున్ శనక బృందం 102 పరుగుల తేడాతో ఘోర ఓటమి చవిచూసింది. దీంతో ఎలాగైనా పాకిస్థాన్‌పై భారీ తేడాతో గెలవాలని లంక భావిస్తోంది. మరోవైపు ఆసియా కప్‌లో ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేపిన సూపర్-4 మ్యాచ్‌లో లంక చేతిలో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలని పాక్ కసితో ఉంది. పైగా ఉప్పల్‌లో వామప్ సహా మూడు మ్యాచ్‌లు ఆడడం బాబర్ సేనకు కలిసొచ్చే అవకాశం ఉంది. మైదానంలో ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు జరిగే అవకాశముంది. షాహీన్ అఫ్రీదీ, హరిస్ రవూఫ్, హసన్ అలీతో పాక్ పేస్ దళం భీకరంగా ఉండగా.. ఓపెనర్లు ఇమాముల్ హక్, ఫఖర్ జమాన్ వరుసగా విఫలం కావడంతో మిడిలార్డర్‌పై భారం పడుతోంది. కెప్టెన్ బాబర్, రిజ్వాన్, షకీల్ ఫామ్ కొనసాగిస్తే పాక్‌కు తిరుగుండదు. మరోవైపు.. కుశాల్ మెండిస్, ప్రథుమ్ నిస్సంక, చరిత అసలంక చెలరేగాలని లంక కోరుకుంటోంది. ఇక సఫారీల వీరబాదుడుకు భారీగా పరుగులు సమర్పించుకున్న తురుపుముక్క మహీశా పతిరణ, మధుషనక, రజితపైనే లంక గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే.. స్పిన్ విభాగంలో పాక్ కంటే శ్రీలంక మెరుగ్గా కనిపిస్తోంది. సఫారీలతో మ్యాచ్‌కు దూరమైన తీక్షణ జట్టుతో కలిశాడు. తనదైన రోజున బంతితో తిప్పేసే దునిత్ వెల్లాలగె, తీక్షణను పాక్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం.






# కివీస్ గెలుపు జోరు...

**న్యూజిలాండ్‌కు రెండో విజయం ▸▸ 99 పరుగులతో నెదర్లాండ్స్‌పై గెలుపు ▸▸ రాణించిన యంగ్, సాన్‌ట్నర్**

ప్రపంచకప్‌లో మరో ఏకపక్ష విజయం... గత టోర్నీ రన్నరప్ న్యూజిలాండ్ సమష్టి ప్రదర్శన ముందు అసోసియేట్ టీమ్ నెదర్లాండ్స్ నిలవలేకపోయింది... బ్యాటింగ్ పిచ్‌పై ముందుగా భారీ స్కోరు నమోదు చేసిన న్యూజిలాండ్ విసిరిన సవాల్‌కు పసికూన నెదర్లాండ్స్ వద్ద జవాబు లేకపోయింది... ఫలితంగా కివీస్ ఖాతాలో వరుసగా రెండో విజయం చేరగా... హైదరాబాద్ వేదికగా ఆడిన రెండు మ్యాచుల్లోనూ డచ్ బృందానికి ఓటమే ఎదురైంది. బ్యాటింగ్‌లో విల్ యంగ్, లాథమ్, రచిన్ రవీంద్ర, బౌలింగ్‌లో సాన్‌ట్నర్ న్యూజిలాండ్ విజయసారథులుగా నిలిచారు.

హైదరాబాద్: న్యూజిలాండ్ జట్టు తమపై ఉన్న అంచనాలను నిలబెట్టుకుంటూ మళ్లీ సత్తా చాటింది. విడిగా చూస్తే విధ్వంసక ప్రదర్శనలు లేకపోయినా... ప్రతీ ఒక్కరూ రాణించడంతో క్వాలిఫయర్ జట్టు నెదర్లాండ్స్‌పై కివీస్ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో న్యూజిలాండ్ 99 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. విల్ యంగ్ (80 బంతుల్లో 70బీ 7 ఫోర్లు, 2 సిక్సులు), టామ్ లాథమ్ (46 బంతుల్లో 53బీ 6 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (51 బంతుల్లో 51బీ 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా... డరైల్ మిచెల్ (47 బంతుల్లో 48బీ 5 ఫోర్లు, 2 సిక్సులు) రాణించాడు. అనంతరం నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కొలిన్ అకెర్‌మన్ (73 బంతుల్లో 69బీ 5 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ సాన్‌ట్నర్ (5/59) ఉప్పల్ స్టేడియంలో వన్డేల్లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

**సమష్టి బ్యాటింగ్‌తో...**

ఆశ్చర్యకర రీతిలో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ బాగా నెమ్మదిగా ప్రారంభమైంది. తొలి మూడు ఓవర్లూ ఒక్క పరుగు లేకుండా మెయిడిన్లుగా ముగియడం విశేషం. అయితే ఆ తర్వాత జట్టు ధాటిని పెంచింది. కాన్వే (40 బంతుల్లో 32బీ 5 ఫోర్లు, 1 సిక్స్), యంగ్ చక్కటి బ్యాటింగ్‌తో తర్వాతి 7 ఓవర్లలో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 63 పరుగులు రాబట్టారు. ఈ జోడీ విడిపోయిన తర్వాత వచ్చిన రచిన్ తన ఫామ్‌ను కొనసాగించాడు. 59 బంతుల్లో యంగ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, రచిన్‌కు హాఫ్ సెంచరీ కోసం 50 బంతులే సరిపోయాయి. మరో ఎండ్‌లో మిచెల్ కూడా జోరు ప్రదర్శించాడు.

కానీ ఈ దశలో డచ్ బౌలర్లు ప్రత్యర్థిని కొద్దిసేపు నిలువరించారు. 16 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి దెబ్బ కొట్టారు. అయితే మరోవైపు లాథమ్ దూకుడు కివీస్ స్కోరును 300 వందలు దాటించింది. సాన్‌ట్నర్ (17 బంతుల్లో 36 నాటౌట్‌బీ 3 ఫోర్లు, 2 సిక్సులు) కూడా చెలరేగడంతో చివర్లో భారీ స్కోరు చేయడంలో న్యూజిలాండ్ సఫలమైంది. ఆఖరి 10 ఓవర్లలో 84 పరుగులు సాధించిన న్యూజిలాండ్ వీటిలో చివరి 3 ఓవర్లలోనే 3 ఫోర్లు, 4 సిక్సులతో 50 పరుగులు రాబట్టడం విశేషం.

**అకెర్‌మన్ మినహా...**

భారీ లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఏ దశలోనూ నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ వేగంగా సాగలేదు. పాక్‌తో మ్యాచ్‌తో పోలిస్తే జట్టు బ్యాటింగ్ ఈ సారి పేలవంగా కనిపించింది. ఓపెనర్లు విక్రమ్‌జిత్ (12), డౌడ్ (16) విఫలం కాగా, అకెర్‌మన్ ఒక్కడే పోరాడగలిగాడు. అకెర్‌మన్, తేజ నిడమనూరు (26 బంతుల్లో 21బీ 2 ఫోర్లు, 1 సిక్స్) మధ్య నమోదైన 50 పరుగుల భాగస్వామ్యమే ఈ ఇన్నింగ్స్‌లో పెద్దది.

క్రీజ్‌లో నిలదొక్కుకొని చక్కటి షాట్లతో జోరుపెంచిన దశలో తేజ లేని రెండో పరుగు కోసం అనవసరంగా ప్రయత్నించాడు. అకెర్‌మన్‌తో సమన్వయ లోపంతో అతను రనౌటయ్యాడు. 55 బంతుల్లో అకెర్‌మన్ అర్ధ సెంచరీ పూర్తయింది. చివర్లో స్కాట్ ఎడ్వర్డ్స్ (27 బంతుల్లో 30బీ 2 ఫోర్లు, 1 సిక్స్), సైబ్రాండ్ (34 బంతుల్లో 29బీ 3 ఫోర్లు) కొంత వరకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. లక్ష్యానికి చాలా దూరంలో నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ ముగిసింది.

**స్కోరు బోర్డు**

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) డి లీడ్ (బి) వాండర్ మెర్వ్ 32బీ యంగ్ (సి) డి లీడ్ (బి) మీకెరెన్ 70బీ రచిన్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాండర్ మెర్వ్ 51బీ మిచెల్ (బి) మీకెరెన్ 48బీ లాథమ్ (స్టంప్డ్) ఎడ్వర్డ్స్ (బి) దత్ 53బీ ఫిలిప్స్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 4బీ చాప్‌మన్ (సి) వాండర్ మెర్వ్ (బి) దత్ 5బీ సాన్‌ట్నర్ (నాటౌట్) 36బీ హెన్రీ (నాటౌట్) 10బీ ఎక్స్‌ట్రాలు 13బీ మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 322. వికెట్ల పతనం: 1--67, 2--144, 3-185, 4--238, 5--247, 6--254, 7--293. బౌలింగ్: ఆర్యన్ దత్ 10--2--62--2, ర్యాన్ క్లీన్ 7--1--41--0, మీకెరెన్ 9--0--59--2, వాండర్ మెర్వ్ 9--0--56--2, అకెర్‌మన్ 4--0--28--0, డి లీడ్ 10--0--64--1, విక్రమ్‌జిత్ 1--0--9--0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (బి) హెన్రీ 12బీ డౌడ్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 16బీ అకెర్‌మన్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 69బీ డి లీడ్ (సి) బౌల్ట్ (బి) రచిన్ 18బీ తేజ (రనౌట్) 21బీ ఎడ్వర్డ్స్ (సి అండ్ బి) సాన్‌ట్నర్ 30బీ సైబ్రాండ్ (సి) కాన్వే (బి) హెన్రీ 29బీ వాండర్‌మెర్వ్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 1బీ క్లీన్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 8బీ ఆర్యన్ దత్ (బి) హెన్రీ 11బీ మీకెరెన్ (నాటౌట్) 4బీ ఎక్స్‌ట్రాలు 4బీ మొత్తం (46.3 ఓవర్లలో ఆలౌట్) 223. వికెట్ల పతనం: 1--21, 2--43, 3--67, 4--117, 5--157, 6--174, 7--180, 8--198, 9--218, 10--223. బౌలింగ్: బౌల్ట్ 8--0--34--0, హెన్రీ 8.3--0--40--3, సాన్‌ట్నర్ 10--0--59--5, ఫెర్గూసన్ 8--0--32--0, రచిన్ రవీంద్ర 10--0--46--1, ఫిలిప్స్ 2--0--11--0.

...DA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS, H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in